సాక్షి
చిత్తూరు

బుధవారం । 2 । ఆగస్టు । 2023



నాడు-నేడులో అలసత్వం వద్దు
నాడు-నేడు రెండో విడత పనులను అలసత్వం లేకుండా వేగవంతంగా పూర్తిచేయాలని డీఈఓ ఆదేశించారు.
- 8లో



అభివృద్ధిపై ప్రమాణానికి సిద్ధమా?
టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి పై ప్రమాణానికి రావాలని మాజీ మంత్రికి ఎమ్మెల్యే వెంకటేగౌడ సవాలు విసిరారు.
- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	26
తిరుపతి	37	27
తిరుమల	32	21
గూడూరు	37	28
నగరి	38	27

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు మంత్రి కరుమూరి రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కరుమూరి వెంకటనాగేశ్వరరావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఉదయం 9 గంటలకు పుంగనూరుకు చేరుకుంటారన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. 11 గంటలకు పుంగనూరు నుంచి రోడ్డుమార్గాన బయలుదేరి తిరుపతికి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సెప్టెంబర్ 9న లోక్ అదాలత్



జడ్జి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ అన్నారు. మంగళవారం చిత్తూరు న్యాయసేవాసదన్ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని ప్రతి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను 17 నుంచి 30 శాతం వరకు అదాలత్‌లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. పోలీసుశాఖ, న్యాయవాదులు, న్యాయమూర్తులు సైతం అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

భవనాల వివరాలు పంపండి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ భవనాల వివరాలను పంపాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్‌సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు మండలాల పరిధిలో ఎన్ని ఉన్నాయి, ఎక్కడ ఉన్నాయి, పూర్తి చేసిన భవనాలు ఎన్ని, నిర్మాణ పనుల్లో ఉన్నవి ఎన్ని, వాటికి పెట్టిన ఖర్చు వివరాలను ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు జెడ్పీ కార్యాలయానికి పంపాలని వివరించారు.

తొలిరోజు 64.93 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని సామాజిక పింఛన్‌దారులకు ఒకటో తేదీ మంగళవారమే వలంటీర్లు పింఛన్ మొత్తాలను ఇళ్ల వద్దకు వెళ్లి అందించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,58,757 మందికి ప్రభుత్వం పింఛను మొత్తాలను మంజూరు చేసింది. తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్వర్ పనిచేయక పోవడంతో పంపిణీ కొంత ఆలస్యం చోటు చేసుకుంది. సాయంత్రానికి 64.93 శాతం మేరకు పంపిణీని పూర్తి చేశారు. మరో రెండు రోజులు పంపిణీని కొనసాగించి వంద శాతం పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు.

కట్టుదిట్టంగా ఫార్మేటివ్ పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా తొలిరోజు మంగళవారం ఫార్మేటివ్, సీబీఏ 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి తెలి పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు. నాలుగు రోజుల ఫార్మేటివ్-1 పరీక్షను మూడవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఇంగ్లిష్‌లోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు 2,23,075 మంది హాజరయ్యారని వెల్లడించారు.

4,5 తేదీల్లో చంద్రబాబు జిల్లా పర్యటన

చిత్తూరు అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 4, 5వ తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో ప్రాజెక్టులు, నీటిపారుదల కాలువలు పరిశీలించేందుకు బాబు జిల్లాకు వస్తున్నట్లు టీడీపీ నాయకులకు సమాచారం అందింది. 4వ తేదీ ఉదయం పలమనేరు, సాయంత్రం పూతలపట్టులో రోడ్‌షో.. బహిరంగ సభ నిర్వహించి అక్కడే ఉన్న ఓ కళ్యాణ మండపంలో రాత్రి బస చేస్తారు. 5వ తేదీ పూతలపట్టు నుంచి రేణిగుంట బాలాజీ రిజర్వాయర్, కరకంబాడీ మల్లెమడుగు రిజర్వాయర్ పరిశీలించి అటునుంచి శ్రీకాళహస్తిలో రోడ్ షో నిర్వహిస్తారు.

ఓపెన్ స్కూల్.. బంగారు భవిత

ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగోన్నతులు, ఉన్నత చదువులు అవసరమైన వారికి ఏపీ ఓపెన్ స్కూల్ విద్య వరంలా మారింది. సార్వత్రిక విద్యా విధానంపై పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానంలో చదువుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ స్టడీ సెంటర్‌లను ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2023-24 విద్యాసంవత్సరానికి ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ కోర్సుల అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 118 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో స్టడీ సెంటర్లు ఉన్నాయి. ఓపెన్ స్కూల్ కోర్సుల ఉపయోగంపై ప్రత్యేక కథనం..

- రెగ్యులర్ కోర్సులతో సమానంగా గుర్తింపు
- ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్మీడియట్ కోర్సులు
- అడ్మిషన్‌లకు నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి జిల్లాలో 118 స్టడీ సెంటర్లు



డీఈఓ కార్యాలయంలోని ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాలలో చదువుకునే అవకాశం లేని వారికి, వయోజనులకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) బంగారు భవిత కల్పిస్తోంది. దూర విద్యావిధానంలో పది, ఇంటర్ కోర్సులను ఏటా నిర్వహిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 118 ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో స్టడీ సెంటర్లలో కోర్సులను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఓపెన్ స్కూల్ ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. పది పరీక్షలకు హాజరు కావాలంటే నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసే వారు టెన్త్ పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక్క సబ్జెక్టూ రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందలేకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితి లేదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్‌కు టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

సబ్జెక్టులు ఇలా ..

పదో తరగతికి గ్రూపు-ఏలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు-బీలో గణితం, సైన్స్ సోషల్ తీసుకోవాలి. ఇంటర్‌కు గ్రూపు-ఏలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు-బీలో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు. ఐదేళ్లలో పూర్తి చేయాలి. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 20 కాంటాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.

గత ఐదేళ్ల అడ్మిషన్ల వివరాలు		
సంవత్సరం	టెన్త్	ఇంటర్
2018-19	4,675	4,233
2019-20	4,572	4,610
2020-21	4,739	6,215
2021-22	3,614	3,928
2022-23	3,095	3,996

రెగ్యులర్ విద్యార్థులకూ సదావకాశం

రెగ్యులర్ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలలో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పాసయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ పదో తరగతి, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్ల లోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే.. రెగ్యులర్‌గా పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. పదిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది.

దరఖాస్తు ఇలా

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 118 అక్రిడిటేటెడ్ ఇన్‌స్టిట్యూషన్లు (ఏఐ) ఉన్నాయి. ప్రవేశాలు పొందగోరే వారు ఆయా అధ్యయన కేంద్రాల్లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఫీజు చెల్లించాలి.
- ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు.
- పదో తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,400, అన్ని వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,000 చెల్లించాలి.
- ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1,600, అన్ని వర్గాల మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనారిటీ వారికి రూ.1,300 చొప్పున ఫీజు చెల్లించాలి. ఈ ఫీజులకు అదనంగా మీసేవ చార్జీలు రూ.36 చెల్లించాల్సి ఉంటుంది.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గుర్తింపు



ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చదువుకునే వారికి రెగ్యులర్ టెన్త్, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ గుర్తింపు ఉంటుంది. ఉపాధి, ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అడ్మిషన్‌లు చేయించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా ఎక్కువగా వసూలు చేస్తే కఠిన చర్యలుంటాయ్.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు చర్యలు



ఈ విద్యాసంవత్సరం ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రణాళిక ప్రకారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. అన్ని శాఖల సమన్వయంతో ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్ల పెంపునకు కసరత్తు చేస్తున్నాం. మధ్యలో చదువు ఆపేసిన వారు సద్వినియోగం చేసుకోవాలి.

– గురుస్వామిరెడ్డి, జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్

పక్కాగా ఓటర్ల జాబితా తయారీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా తయారీ కసరత్తు పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని డీఆర్వో రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డీఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖకు అత్యంత కీలకమైన బాధ్యతలు అప్పజెప్పిందన్నారు. అలసత్వం లేకుండా విధులను నిర్వహించాలని తెలిపారు. తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు, ఇతర కసరత్తు నిర్వహించాలని తెలిపారు. బదిలీ అయి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, మరణించిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీ ఉన్న పేర్లను గుర్తించి తొలగించాలని పేర్కొన్నారు. ఎలాంటి ఫిర్యాదులకు తావులేని విధంగా జాబితా రూపొందించాలని తెలిపారు. జిల్లాలో అసైన్‌మెంట్ పట్టాల పంపిణీకి చర్యలు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. స్పందన వినతులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, ఎస్‌డీసీ పర్వీన్‌తాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల క్రీడా పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : విభిన్నప్రతిభావంతులకు బుధవారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల మైదానంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

పాల సేకరణలో మొదటి స్థానం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు అగ్రికల్చర్: జగనన్న పాల వెల్లువ ద్వారా పాల సేకరణను రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయ సమావేశ భవనంలో పశు సంవర్ధకశాఖ, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పాడి రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకోసం అమూల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని జగనన్న పాల వెల్లువ ద్వారా అధిక పాల సేకరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే పలు మండలాల్లో జగనన్న పాల వెల్లువ ద్వారా సేకరిస్తున్న పాలకు మంచి గిట్టుబాటు ధరను కల్పించి పాడి రైతులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. అమూల్ సంస్థ పలుమార్లు పాల రేట్లను పెంచి ప్రైవేటు డెయిరీల దోపిడీని అరికడుతోందన్నారు. పాడి రైతులను సంప్రదించి అధిక మొత్తంలో పాల సేకరణను జగనన్న పాల వెల్లువ ద్వారా సేకరించాలన్నారు.

101 సెంటర్ల ద్వారా సేకరణ

పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో 101 సెంటర్ల ద్వారా పాల సేకరణ జరుగుతోందని తెలిపారు. అలాగే రెండవ విడతలో మరో 300 గ్రామాల్లో పాల సేకరణకు సంబంధించి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా డెయిరీ డెవలప్‌మెంట్ అధికారి రవిచంద్రన్ మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో వలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వేలో ఎంత మందికి పాడి ఆవులు, గేదెలు ఉన్నాయని, ఇంకా ఎంత మందికి ఆవులు, గేదెలు అవసరమన్నది సేకరిస్తున్నామన్నారు. అమూల్ డెయిరీకి కనీసం పదిరోజులు పాలుపోసిన పాడి రైతులకు జిల్లా సహకార సంస్థ ద్వారా పాడి పశువుల కొనుగోలుకు రూ. 30 వేల ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. రోజుకు 160 లీటర్ల పాలు వస్తే ఆ గ్రామంలో పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ హరీష్, అమూల్ డెయిరీ మేనేజర్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ సేకరణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పలు అభివృద్ధి పనులకు భూ సేకరణను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్‌హెచ్, రెవెన్యూ, భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అభివృద్ధి పనుల భూ సేకరణ తహసీల్దార్ల బాధ్యతని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలున్నట్‌లెతై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆరులేన్ల రోడ్డు పనులు దాదాపు పూర్తి అయినట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గం పనబాకం వద్ద పనులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు భూ నిర్వాసితులకు పరిహారం చెలిస్తామని, అదనపు పరిహారం కోసం నివేదికలు పంపుతామని చెప్పారు. అనంతరం భూ నిర్వాసితుల నుంచి జేసీ ఫిర్యాదులను స్వీకరించారు.

థ్యాంక్యూ సీఎం సార్..



పాలాభిషేకం చేస్తున్న ద్రవిడ వర్సిటీ అధ్యాపకులు

కుప్పం: ఉద్యోగ విరమణ వయస్సు పెంచడంపై కృతజ్ఞతలు తెలియజేస్తూ ద్రవిడ వర్సిటీలో మంగళవారం అధ్యాపకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ వర్సిటీ అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 62 నుంచి 65కు పెంచుతూ జీఓ నంబర్ 39ని విడుదల చేయడం హర్షణీయమన్నారు. అనంతరం వర్సిటీ గేటు వద్ద థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డి, రెక్టార్ ఆచార్య అనురాధ మాట్లాడుతూ పదవి విరమణ వయస్సు మూడేళ్లపాటు పెంచడం అభినందనీయమని తెలిపారు.

ఉద్యోగులు కుటుంబసభ్యులే..



సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగులు కుటుంబసభ్యులతో సమానమని, స్నేహపూర్వక వాతావరణంలో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలోని వ్యవస్థాపక, ఆర్థిక, ప్రణాళిక, భవిష్యనిధి, విద్య సెక్షన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి వారు మాట్లాడారు. ఉద్యోగులు ఫైల్స్‌ను వీలైనంత వరకు పెండింగ్‌లో పెట్టుకోకూడదని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. చిందరవందరగా కాకుండ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నివాసాల్లోకంటే ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని, ఐక్యంగా ఉండాలని సూచించారు. ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు లేవని, విధి నిర్వహణలో పారదర్శకంగా ఉండాలన్నారు. కలిసి పనిచేయాలే తప్ప అసత్య ప్రచారాలు చేస్తూ జెడ్పీకి చెడ్డ పేరు తీసుకురాకుండా చూడాలని ఏఓలకు వివరించారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మా-డి, కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పీజీ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ సత్యనారాయణ తెలిపారు. గేట్, జి పాట్ అర్హత మార్కులు కలిగిన జనరల్ అభ్యర్థులు రూ. 600, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.300 ఈ నెల 4వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 9 నుంచి 11వ తేదీలోపు ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని కోరారు. 22వ తేదీ నుంచి గేట్, జిపాట్ అభ్యర్థులకు సీట్లు అలాట్ చేస్తామన్నారు. పీజీ ఈసెట్-2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 26 నుంచి 31 తేదీలోపు ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వచ్చేనెల 8 నుంచి 11వ తేదీ వరకు వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని, అదే నెల 15వ తేదీ నుంచి సీట్లు అలాట్ చేస్తామన్నారు. https//cets.apsche.apgov.in వెబ్‌సైట్‌ను వీక్షించి ధ్రువపత్రాలు, రుసుం చెల్లించి పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందాలని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

గొల్లపల్లెమ్మ ఆలయంలో చోరీ

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత దాసరిగూడెంలో వెలసి ఉన్న గొల్లపల్లెమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం ఆలయ ధర్మకర్త రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం మేరకు.. దుండగులు ఆలయం ప్రవేశించి అమ్మవారి తాళిబొట్టు, మెమరీ కార్డులను చోరీ చేశారని తెలిపారు. సీసీ కెమెరాల్లో నిందితులు చోరీ చేస్తున్న దృశ్యాలు నమోదయ్యాయని, త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. కొద్ది రోజుల కందట మద్దిపట్లవారిపల్లె శ్రీ విరూపాక్షి అమ్మవారి ఆలయంలో కూడా చోరీ జరిగిందన్నారు. కొందరు యువకులు గ్రామాల్లో చెత్త, ప్లాస్టిక్, బాటిళ్లను ఏరుకుంటున్నట్లు నటిస్తూ చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

- ప్రాజెక్టుల స్టేపై సమాధానం చెప్పకుంటే బాబు పర్యటనను అడ్డుకుంటాం
- 14 ఏళ్లు సీఎంగా చేసిందేమీ లేదు
- వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పక్కన నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు: ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పని చేసి రాయలసీమ జిల్లాలకు ద్రోహం చేసిన చంద్రబాబు పుంగనూరులో ప్రాజెక్టుల స్టే ఎందుకు వేశారో సమాధానం ఇవ్వాలని, లేదంటే ఈనెల 4న చంద్రబాబును అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ పడమటి నియోజకవర్గాలకు సాగునీరు–తాగునీరు అందించేందుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో నిర్మిస్తున్న ముదివేడు, పుంగనూరు, సోమలలో నిర్మిస్తున్న మూడు ప్రాజెక్టులపై బాబు అండ్‌కో తప్పుడు కేసులు దాఖలు చేసి, పనులు ఆపి వేశారన్నారు. ఈ ప్రాజెక్టులతో ఎవరికి నష్టం జరిగిందో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు చెప్పకపోతే ఆయన పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. బాబు హయాంలో చేయలేని పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టడంతో మనుగడ కోల్పోతామన్న భయంతో చంద్రబాబు తప్పుడు కేసులు వేశారని మండిపడ్డారు. కోర్టుల్లో విజయం సాధించి ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు సీఎంగా చంద్రబాబు సీమ జిల్లాలను అభివృద్ధి చేయకపోగా సొంత నియోజకవర్గానికి తాగునీరు ఇవ్వడంలో విఫలమైయ్యారని ఎద్దేవా చేశారు. పుంగనూరు పర్యటనలో చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని, లేదంటే నిలదీస్తామన్నారు.

బాబు ఆపేసిన పనులు వైఎస్సార్‌సీపీలో..

ఎంపీపీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో పుంగనూరు ఆర్టీసీ డిపో, బైపాస్‌రోడ్డు, గ్రామీణ రహదారులు, ఎంబీటీ రోడ్డు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, హంద్రీనీవా కాలువ పనులు ఆపి వేసినట్లు తెలిపారు. టీడీపీ హయాంలో ఆపి వేసిన పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తి చేసి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ఈ పనులను చూసి వెళ్లేందుకా..? లేక పనులు చేసినందుకు ప్రశంసించేందుకా వచ్చేది అంటు ఎద్దేవా చేశారు. పుంగనూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. బాబు పాలనలో పుంగనూరు అభివృద్ధిని అడ్డుకున్నారే తప్పా అభివృద్ధి చేశారా అంటు ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, ఎంపీపీ ఎల్లప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజారెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు దుర్మరణం

- మరో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు
- మృతుడిది శ్రీకాళహస్తి మండలం పెద్దకన్నలి


మృతి చెందిన వేణుగోపాలాచారి(ఫైల్)


గాయపడిన గోవిందస్వామి

కుప్పంరూరల్ : మల్లానూరు పంచాయతీ కృష్ణాపురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డి.అగ్రహారం ఉపాధ్యాయుడు వేణుగోపాలాచారి (51) దుర్మరణం చెందిగా, మరో ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. కుప్పం మండలం డి.అగ్రహారం ఉపాధ్యాయుడు వేణుగోపాలాచారి (51) డిప్యూటేషన్‌పై జంపనూరు పాఠశాలలో పని చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం పాఠశాల ముగించుకుని, స్నేహితుడు, కనుమపచ్చార్లపల్లె ఉపాధ్యాయుడు గోవిందస్వామితో కలిసి తమిళనాడు రాష్ట్రం పచ్చూరికి సొంత పనుల నిమిత్తం వెళ్లాడు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. మల్లానూరు పంచాయతీ కృష్ణాపురం సమీపానికి రాగానే ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో వేణుగోపాలాచారి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. గోవిందస్వామి తీవ్ర గాయాలతో బయటపడ్డారు. స్థానికులు గమనించి గోవిందస్వామిని ఆస్పత్రికి తరలించారు. వేణుగోపాలా చారి శ్రీకాళహస్తి మండలం, పెద్ద కన్నలి గ్రామానికి చెందిన వారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రానైట్ దిమ్మె పడి..


మృతి చెందిన సుశీల్

కుప్పం మండలం, తంబిగానిపల్లె సమీపంలో గ్రానైట్ పరిశ్రమలో పని చేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన సుసీల్ (23) ప్రమాదవశాత్తు గ్రానైట్ దిమ్మెపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని సుసీల్ స్వగ్రామానికి పంపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో రిమాండ్ ఖైదీ మృతి

తిరుపతి క్రైమ్: హత్యకేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. రామకుప్పం గ్రామానికి చెందిన ప్రమీల(47) కొంతకాలంగా బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఓ హత్య కేసులో ఈమె మదనపల్లె జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంది. ఇదే క్రమంలో ఆమెకు గత నెలలో గుండెపోటు రావడంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందింది. అయితే మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి గత నెల 26వ తేదీన తరలించారు. ఆమె ఇక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంల నుంచి సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్–2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో విజయేంద్రరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో అందజేసే అవార్డులకు ఈనెల 31 లోపు www.awardr.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డీవైఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని డీఈవో ఆ ప్రకటనలో సూచించారు.

నాడు-నేడులో అలసత్వం వద్దు

చిత్తూరు కలెక్టరేట్ : నాడు– నేడు రెండవ విడత పనుల పురోగతిలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను సమూలంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలని ఆదేశించారు. పనులను పర్యవేక్షిస్తూ నాణ్యతగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

పంచాయతీ నిధులు రూ.10.56 కోట్ల జమ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10.56 కోట్లు సంబంధిత ఖాతాల్లో జమ చేసినట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. మండలాల వారీగా వివరాలను ప్రకటించారు. బైరెడ్డిపల్లె రూ.47.85 లక్షలు, బంగారుపాళ్యం రూ.47.11, చిత్తూరు రూ.17.94 లక్షలు, చౌడేపల్లె రూ.25.26 లక్షలు, జీడీనెల్లూరు రూ.41.45 లక్షలు, గంగవరం రూ.47.55, గుడిపాల రూ.28.15 లక్షలు, గుడుపల్లె రూ.37.71 లక్షలు, ఐరాల పంచాయతీకి రూ.30.36 లక్షలు జమ చేశారు. కార్వేటినగరం రూ.33.91 లక్షలు, కుప్పం రూ.74.60 లక్షలు, నగరి రూ.19.38 లక్షలు, నింద్ర రూ.17.28 లక్షలు, పలమనేరు రూ.20.36 లక్షలు, పాలసముద్రం రూ.14.78 లక్షలు, పెద్దపంజాణి రూ.37.51 లక్షలు, పెనుమూరు రూ.23.03 లక్షలు, పులిచెర్ల రూ.25.52 లక్షలు, పుంగనూరు రూ.34.90 లక్షలు, పూతలపట్టు రూ.27.13 లక్షలు, రామకుప్పం రూ.53.05 లక్షలు, రొంపిచెర్ల రూ.12.78 లక్షలు, ఎస్‌ఆర్‌పురం రూ.24.99 లక్షలు, శాంతిపురం రూ.48.95 లక్షలు, సదుం రూ.38.77 లక్షలు, సోమల రూ.30.85 లక్షలు, తవణంపల్లె రూ.32.91. లక్షలు, వి.కోట రూ.80.36 లక్షలు, వెదురుకుప్పం రూ.30.29 లక్షలు, విజయపురం రూ.20.29 లక్షలు, యాదమరి పంచాయతీకి రూ.31.82 లక్షలు జమ చేసినట్లు వివరించారు.

గందరగోళంగా నారాయణ పాఠశాల నిర్వహణ

వి.కోట: పేరుకు నారాయణ పాఠశాల. విద్యార్థులకు మంజూరు చేసే టీసీలు మాత్రం శ్రీసత్యసాయి పాఠశాలా అంటూ తల్లిదండ్రులు యాజమాన్యంపై విరుచుకుపడుతున్నారు. మండలంలోని ఎర్రంపల్లెకు చెందిన ఓ విద్యార్థి వి.కోటలోని నారాయణ విద్యా సంస్థల పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ టీసీ కావాలని ప్రిన్సిపాల్‌ను అడిగారు. ఆమె సత్యసాయి పాఠశాలలో విద్య అభ్యసించినట్లు టీసీ ఇచ్చారు. నారాయణ పాఠశాల పేరిట అధిక ఫీజు వసూలు చేసి టీసీ సత్యసాయి అని ఇవ్వడమేంటని బాధితుడు ప్రశ్నించారు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ వివరణ కోరగా 2022 మే నెలలో నారాయణ విద్యా సంస్థల వారు గతంలో సత్యసాయి పాఠశాలను టేకోవర్ చేసుకున్నారని, అడ్మిషన్ల సమయంలో రాష్ట్రంలో నారాయణ విద్యా సంస్థల ప్రారంభానికి అనుమతులు లేకపోవడంతో తరగతులు మాత్రం నిర్వహిస్తూ వచ్చారన్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలకు అనుమతులు మంజూరయ్యాయని, గతంలో అడ్మిషన్ అయిన వారికి సత్యసాయి పాఠశాలగానే టీసీలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ అధిక ఫీజులపై మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థల ప్రకారమే బోధన కొనసాగించామని, అనుమతులు రాక ముందు అడ్మిషన్ అయిన పిల్లలను సత్యసాయి పాఠశాల అనుమతితో కొనసాగించామని తెలిపారు.

7లోపు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : 'ఆడుదాం ఆంధ్ర' పోటీల నిర్వహణ లోగో, మస్కట్ ఎంపిక పోటీలకు ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు అక్టోబర్ 2వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయన్నారు. ఈ పోటీల నిర్వహణలో లోగో, మస్కట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు www.sports.ap. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొన్న తర్వాత లోగో, మస్కట్‌లు ఎంపికైతే సంబంధిత విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు అందజేస్తారని చెప్పారు.

పెనుమూరులో రూ.1.40 కోట్లకు ఐపీ దాఖలు

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): తాను తీసుకున్న అప్పు మొత్తాలను చెల్లించలేనంటూ పెనుమూరు మండలం సంగీతగోపన్న పల్లెకు చెందిన దాము నాయుడు మంగళవారం పులువురికి ఐపీ పెట్టారు. పెనుమూరు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన దాదాపు 30 మంది వద్ద రూ.1.40 కోట్ల మేరకు అప్పు చేశాడు. తాను తీసుకున్న అప్పులను చెల్లించలేనంటూ కోర్టును ఆశ్రయించి ఐపీ దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టు ద్వారా మంగళవారం పలువురికి ఐపీ నోటీసులు అందాయి. ఇటీవల పెనుమూరుకు చెందిన బట్టల వ్యాపారి పాండురంగయ్యశెట్టి, ప్రవీణ్ దాదాపు రూ.87 కోట్ల మేరకు కోర్టులో ఐపీసీ దాఖలు చేశారు. తాజాగా మరో ఐపీ దాఖలు కావడంతో ప్రజల్లో ఆందోళనలు నెలకొంటున్నాయి.

వివాహిత ఆత్మహత్య


మనీషా

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో వివాహిత మనీషా (25) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. గిరింపేటకు చెందిన మనీషాకు వేలు అనే వ్యక్తితో నాలుగేళ్ల కిందట పెళ్లయ్యింది. నాని డ్రైవర్‌గా పని చేస్తుంటే, మనీషా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. వీళ్లకు సంతానం లేదు. తరచూ మనీషాను పిల్లలు లేరని, సంసారానికి పనికిరావంటూ వేలు వేధించేవాడు. ఈ క్రమంలో గిరింపేటలోని తన తల్లి ఇంట్లో ఉన్న మనీషా ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో వడమాలపేట విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

- 4 బంగారు, 5 వెండి, 5 కాంస్య పతకాలు కైవసం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పుత్తూరు రూరల్: అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో గత నెల 29 నుంచి రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ (కుస్తీ పట్టు) పోటీల్లో వడమాలపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆరో తరగతి విద్యార్థి తనుష్ 24 కేజీల విభాగంలో, తొమ్మిదో తరగతి చదువుతున్న అంజలి 34 కేజీల విభాగంలో, ఉదయ్‌కుమార్ 66 కేజీల విభాగంలో, శ్రావణ్‌కుమార్ 84 కేజీల విభాగంలో బంగారు పతకాలను సాధించారు. అలాగే వివిధ కేటగిరీల్లో దేవహర్ష, మోహిత్, కిషోర్, యూనస్, లతాశ్రీ వెండి పతకాలతో మెరిశారు. జైసూర్య, రేవంత్‌కుమార్, భానుప్రకాష్, జగదీష్, ప్రియదర్శిని వివిధ విభాగంలో కాంస్య పతకాలను సాధించి సత్తా చాటారు. బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. పలు పతకాలు సాధించి విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ చంద్రశేఖర్‌రాజును హెచ్‌ఎం కరుణా నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు.

6 నుంచి ఉమ్మడి జిల్లాల చెస్ పోటీలు

నగరి : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి ఉమ్మడి జిల్లాల చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కేవీకే ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 16 ఏళ్లకు పైబడివారికి ఓపెన్ కేటగిరీలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. రెండు కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు కప్‌లు అందిస్తామన్నారు. జూనియర్స్‌లో 20 మందికి, సీనియర్స్‌లో 10 మందికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. ప్రత్యేక అవసరాలు గల బాల, బాలికలు, దివ్యాంగులకు, మహిళలకు ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 94402 13131, 89772 99886 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అభివృద్ధిపై కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా?

- మేం చేసిన అభివృద్ధిలో పది శాతం మీరు చేశారా?
- రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్ మీ మనిషి కాదా..
- నాది తప్పని నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా
- మాజీమంత్రి అమర్‌కు సవాల్ విసిరిన ఎమ్మెల్యే వెంకటేగౌడ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: 'మీరు మూడు దశాబ్దాల పాటు పలమనేరు నియోజకవర్గాన్ని పాలించారు. మీ పాలనలో జరిగిన అభివృద్ధికి మా పాలనలో జరిగిన అభివృద్ధిపై కాణిపాకంలో ప్రమాణానికి మీరు సిద్ధమేనా'? అని మాజీ మంత్రి అమరనాథ రెడ్డికి పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ సవాలు విసిరారు. పట్టణంలోని పల్లెవీధిలో మంగళవారం ఆయన పార్టీనేతలతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇంటింటికీ తెలుగుదేశం పేరిట వీకోట మండలంలో మీరు నిర్వహిస్తున్న కార్యక్రమానికి జనం నుంచి స్పందన లేక పోవడంతో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న మైనారిటీలను రెచ్చగొట్టి లబ్ధిపొందేందుకు ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. మీ సొంత గ్రామంలో రూ.10 లక్షల విలువైన అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించుకోలేని మీరు వీకోటలో రూ.కోట్లతో ఉర్దూ జూనియర్ కాలేజీని నిర్మిస్తామంటే జనం నమ్మడానికి సిద్ధంగా లేరని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న మీరు మీ సొంత పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా వీకోటలో రాజకీయాలు చేస్తున్న విషయం అందరూ గమనిస్తున్నారని తెలిపారు. మంత్రిగా నియోజకవర్గంలో కనీసం ఓ పరిశ్రమనైనా తీసుకురాని మీరు ఇప్పుడు ఎన్నికల కోసం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మీసొంత గ్రామంలో త్వరలో ఆర్‌బీకే, సచివాలయం భవనాలను తాము ప్రారంభిస్తామన్నారు. మీ సొంత గ్రామంలో రోడ్డు లేదని గ్రామస్తులు అడిగితే జీజీఎంపీ నిధుల ద్వారా నిధులను మంజూరు చేస్తే అడ్డుకుంది మీరు కాదా అన్నారు. కనీసం మీ గ్రామంలో ఉన్న పాఠశాలను బాగు చేసుకోలేని మీరు ఈ ప్రభుత్వం అభివృద్ధిపై మాట్లాడడం సరికాదన్నారు.

నాడు–నేడుతో రూ.కోట్లతో అభివృద్ధి

వీకోట మండలం నడిపేపల్లెలో రూ.1.79 కోట్లతో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే తెలిపారు. వీకోట బైపాస్‌కు సంబంధించి తాము ప్రజల ఆకాంక్ష మేరకు నడుచుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేశామన్నారు. కానీ నేషనల్ హైవే వారి ఆదేశాలను దిక్కరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని తెలిపారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ నిర్మిస్తున్న హైవే కర్ణాటక రాష్ట్రంలో వెలుతోందని గొగ్గోలు పెట్టే వాళ్లు గతంలో ఏపీలో వెళ్లిన కర్ణాటక రోడ్లపై ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు టీడీపీ హయాంలో ఆసియా బ్యాంకు కాంట్రిబ్యూషన్‌తో జరిగాయని, ఇందుకు సంబంధిత టీడీపీ కాంట్రాక్టర్ కాంట్రిబ్యూషన్ డబ్బును చెల్లిస్తే తప్ప నిధులు విడుదల కావన్నారు. దీన్ని కూడా తమ ప్రభుత్వంపై రుద్దడం న్యాయం కాదన్నారు. నియోజకవర్గంలో రోడ్లకు సంబంధించి కాంట్రాక్టర్ మీ వాడు కాదని కాణిపాకంలో ప్రమాణం చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. నాడు–నేడు కింద నియోజకవర్గంలో రూ.145 కోట్లతో సర్కారు బడులను అభివృద్ధి చేసిన విషయాన్ని మాజీ మంత్రి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే తప్ప మాజీ మంత్రిగా అమర్ చేసిందేమీ లేదని విమర్శించారు. నియోజకవర్గంలో400 రోజులు గ్రామాలకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించానని తెలిపారు.